
సాక్షి
కుమురం భీం

ఆదివారం । 26 । మార్చి । 2023



చౌక యాత్ర

అతి తక్కువ బడ్జెట్‌లో వీలైన సమయానికే ఎంచుకున్న పర్యటన పూర్తయితే ఆ ఆనందమే వేరు. అలాంటి ఔత్సాహికుల కోసం ఐఆర్‌సీటీసీ తోడ్పాటునందిస్తోంది. 8లో▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
ఆది సా: 6:28	సోమ ఉ: 4:52

గరిష్టం/కనిష్టం
34.0 /23.0

వాతావరణం

ఆకాశం కొంత మేఘావృతమై కనిపిస్తుంది. పగలు ఎండ తీవ్రత అధికమై ఉక్కపోతగా ఉంటుంది. రాత్రివేళ చలి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

పులి బాధిత కుటుంబాలకు పరిహారం చెక్కులు



పరిహారం చెక్కులు పంపిణీ చేస్తున్న ఎఫ్‌బీవో

దహెగాం: గతేడాది పులి దాడిలో పశువులు మృతి చెందగా మంజూరైన పరిహారం చెక్కులను శనివారం ఎఫ్‌బీవో సద్దాం వాటి యజమానులకు పంపిణీ చేశారు. మండలంలోని కర్జి, గిరవెల్లి, లోహ గ్రామాలకు చెందిన దేవాజీకి రూ.22వేలు, సందికట్ల రాజలింగుకు రూ.14వేలు, రౌతు చంద్రయ్యకు రూ.12వేలు, మడె శంకర్‌కు రూ.18వేలు, తలాండి హన్మంతుకు రూ.20వేలు, రౌతు బుచ్చయ్యకు రూ.22వేల విలువైన చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచులు రాజన్న, సంజీవ్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలి



నాన్ ఓవెన్ సంచులు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు

ఆసిఫాబాద్: ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ హేమంత్ బొర్కడే సహదేవ్‌రావు సూచించారు. జిల్లా కేంద్రంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నాన్ ఓవెన్ సంచుల తయారీ మిషనరీని శనివారం జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలని సూచించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్‌ను నిషేధిద్దామని సామూహిక ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీఆర్డీవో సురేందర్, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు శ్రీదేవి, మండలాధ్యక్షురాలు సౌజన్య, మహిళా సంఘ సభ్యులు మార స్వరూపారాణి, పద్మావతి, భాగ్య, ఏపీఎం శ్రీనివాస్, ఎస్‌హెచ్‌జీ సభ్యులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా ఏకాదశ దీక్షలు



భక్తులకు మాలధారణ చేస్తున్న పండితులు

ఆసిఫాబాద్‌అర్బన్: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని శనివారం జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో 400 మంది, మండలంలోని బాబాపూర్ గ్రామంలోని హనుమాన్ ఆలయంలో 100 మంది భక్తులు ఏకాదశ దీక్షలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో ఉదయం 5గంటల నుంచి అర్చకులు ఒజ్జల శిరీశ్‌శర్మ, ఢిల్లీ విజయ్‌కుమార్, జంబోజుల తిరుపతిచారి ఆధ్వర్యంలో గణపతిపూజ, నవగ్రహపూజ, ఆంజనేయస్వామికి రుద్రాభిషేకం, అష్టోత్తర శతనామపూజ నిర్వహించారు. అనంతరం దీక్షాపరులకు మాలధారణ చేశారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఐఈవో

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో ఇంటర్ పరీక్షలు తొమ్మిదోరోజు ప్రశాంతంగా ముగిసినట్లు డీఐఈవో శ్రీధర్ సుమన్ తెలిపారు. శనివారం ఫస్టియర్ విద్యార్థులకు జనరల్ ఫిజిక్స్, ఎకనామిక్స్, ఒకేషనల్ పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా జనరల్ సబ్జెక్ట్‌లో 4,551 మంది, ఒకేషనల్‌లో 810 మంది హాజరు కావాల్సి ఉండగా జనరల్‌లో 4,313, ఒకేషనల్‌లో 702 మంది హాజరైనట్లు వెల్లడించారు. 346 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. స్థానిక ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని డీఈసీ బృందం పర్యవేక్షించి వివరాలు తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. పరీక్షల్లో ఎప్పటికప్పుడు గైర్హాజరు విద్యార్థుల బార్‌కోడ్ స్కానింగ్ పూర్తి చేయాలని, రికార్డులు సకాలంలో నమోదు చేయాలని సూచించారు. 20 పరీక్ష కేంద్రాల్లో వైద్య సిబ్బంది, పోలీస్ బందోబస్తు సక్రమంగా కొనసాగుతోందని తెలిపారు. పరీక్ష కేంద్రాలను డీఈసీ బృందం, ఒక ఫ్లయింగ్ స్క్వాడ్, త్రిసభ్య టీం, నలుగురు సిట్టింగ్ స్క్వాడ్‌లు పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు.

ఉత్తిపోతలే..!



జిల్లాలో పెన్‌గంగ, ప్రాణహిత నదులు నిత్యం నిండుకుండను తలపిస్తుంటాయి. కానీ.. జిల్లాలో ఇప్పటివరకు రైతుల పంటలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. జిల్లా చుట్టూ జీవనదులున్నా.. పంట పొలాలు మాత్రం బీళ్లుగానే ఉంటున్నాయి. ఏటా వర్షాధారంగానే రైతులు పంటలు సాగు చేయాల్సిన దుస్థితి కొనసాగుతోంది. నిర్మించిన ఎత్తిపోతల పథకాలు నిర్వహణకు నోచుకోక నిరుపయోగం కాగా, రైతులకు సాగునీరు అందని ద్రాక్షగా మారింది.

నిరుపయోగంగా తుమ్మిడిహెట్టి ఎత్తిపోతల పథకం



ఈ చిత్రంలో కనిపిస్తున్నది కౌటాల మండలం సాండ్‌గాం గ్రామ శివారులోని పెన్‌గంగానది సమీపంలోగల ఎత్తిపోతల పథకం. ఈ సాండ్‌గాం ఎత్తిపోతల పథకాన్ని 2009లో ఐదువేల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో నిర్మించారు. నిర్వహణ సరిగా లేక రెండేళ్లుగా వినియోగంలో లేదు. దీంతో రైతులకు సాగునీరు అందడం లేదు. ఇది నిరుపయోగంగా ఉన్నా ప్రతినెలా రూ.4 లక్షల వరకు కరెంట్ బిల్లు వస్తోంది. ప్రస్తుతం రూ.6కోట్ల విద్యుత్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నట్లు ఆ శాఖ అధికారులు చెబుతున్నారు.

- ఎత్తిపోతల పథకాలు నిరుపయోగం
- నిర్వహణ లోపంతో నీరందని దుస్థితి
- రూ.కోట్లలో విద్యుత్ బిల్లు బకాయిలు
- సాగునీరు అందక బీళ్లుగా భూములు
- ఆందోళనలో ఆయకట్టు రైతాంగం

కౌటాల(సిర్పూర్): ఆరుగాలం శ్రమించే అన్నదాతకు కన్నీటి వేదనే మిగులుతోంది. చెమట చుక్కలు చిందించి సాగుచేస్తే పంట చేతికి వచ్చేదాకా నమ్మకం ఉండడం లేదు. ప్రకృతి పగబడుతున్నప్పుడల్లా సాగునీరు అందక పంటలు ఎండుతున్నాయి. ఎన్నో ఏళ్లుగా ఎత్తిపోతల పథకాలు నిరుపయోగంగా ఉండగా ఏటా రైతులు వర్షాధారంగానే సాగు చేస్తున్నారు. వర్షాలు సక్రమంగా కురవకపోతే పంటలు ఎండిపోతుండగా తీవ్రంగా నష్టపోతున్నారు. ఎత్తిపోతల పథకాలు వినియోగంలో లేకున్నా విద్యుత్ బిల్లు మాత్రం ప్రతినెలా వస్తుండగా విస్తుపోతున్నారు.

చుట్టూ నదులు.. అందని నీరు

పుష్కలంగా జలవనరులుండే ప్రాణహిత, పెన్‌గంగ నదుల నుంచి ఎత్తిపోతల ద్వారా సాగునీరు అందించడానికి రూ.కోట్లు ఖర్చు చేసినా రైతులకు చుక్క నీరు అందడంలేదు. నిర్వహణ లేక కొన్ని నిరుపయోగంగా మారగా, నిర్మాణాలు పూర్తి కాక కొన్ని రైతులకు ప్రయోజనం చేకూర్చడంలేదు. జీవనదిని తలపించేలా కనువిందు చేసే ప్రాణహిత నదిపై సిర్పూర్(టీ), కౌటాల, చింతలమానెపల్లి మండలాల్లో ఏడు ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. ఇందులో వీర్దండి ఎత్తిపోతల పథకం మాత్రమే కొంతమేరకు నీరందిస్తోంది. చింతలమానెపల్లి మండలం కోర్సిని, గూడెం, రణవెల్లి గ్రామాల్లో కొన్నేళ్లుగా కొనసాగుతున్న ఎత్తిపోతల పథకాల నిర్మాణాలు పూర్తి కాలేదు. రైతులకు సాగునీరు పూర్తిస్థాయిలో అందడం లేదు.

ప్రభుత్వ పట్టింపు కరువు

కౌటాల మండలంలో తుమ్మిడిహెట్టి, వీర్దండి, గుండాయిపేట, సాండ్‌గాం ఎత్తిపోతల పథకాలున్నాయి. ఇందులో సాండ్‌గాం ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించగా ఏళ్లుగా వీరవెల్లి, కౌతి, సాండ్‌గాం, పార్డీ గ్రామాలకు చెందిన ఐదువేల ఎకరాలకు సాగునీరు అందించింది. రైతులు ఏటా మూడు పంటలు పండించి ఆదర్శంగా నిలిచారు. ఈ గ్రామాల్లో పండించిన వరి ధాన్యాన్ని సహకార సంఘం, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించారు. సాగునీరు సకాలంలో అందడంతో రైతులు అధిక దిగుబడులు సాధించి ఆర్థికంగా వృద్ధి చెందారు. కానీ.. అధికారుల నిర్లక్ష్యం.. రైతుల సమన్వయ లోపంతో నిర్వహణ సక్రమంగా లేక రెండేళ్ల నుంచి సాండ్‌గాం ఎత్తిపోతల పథకం నిరుపయోగమైంది. దీంతో సమీప పంట పొలాలు బీళ్లుగా మారే పరిస్థితి నెలకొంది. సాండ్‌గాం ఎత్తిపోతల పథకం నిరుపయోగంగా ఉన్నా ప్రతినెలా రూ.4లక్షల వరకు విద్యుత్ బిల్లు వస్తోందని విద్యుత్‌శాఖ అధికారులు చెబుతున్నారు. పెద్దపెద్ద ప్రాజెక్టులు కూడా సాగునీరు అందించని సమయంలో పదేళ్ల పాటు రైతులకు సాగునీరు అందించిన సాండ్‌గాం ఎత్తిపోతల పథకాన్ని వినియోగంలోకి తేవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

నిరుపయోగం, నిర్మాణ దశలోని ఎత్తిపోతల పథకాల వివరాలు

మండలం	గ్రామం	ఆయకట్టు (ఎకరాల్లో)	వ్యయం
కౌటాల	తుమ్మిడిహెట్టి	1,000	రూ.3కోట్లు
కౌటాల	సాండ్‌గాం	5,000	రూ.29కోట్లు
చింతలమానెపల్లి	రణవెల్లి	4,750	రూ.28కోట్లు
చింతలమానెపల్లి	కోర్సిని	3,995	రూ.36కోట్లు
చింతలమానెపల్లి	గూడెం	2,000	రూ.17.50కోట్లు
సిర్పూర్(టీ)	హుడ్కిలి	1,400	రూ.3కోట్లు
సిర్పూర్(టీ)	లోనవెల్లి	1,100	రూ.2కోట్లు
కెరమెరి	సుర్జాపూర్	1,200	రూ.3కోట్లు
కాగజ్‌నగర్	జంబుగ	400	రూ.1.5కోట్లు



విలేకరులతో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క, పక్కన ప్రేమ్‌సాగర్‌రావు



సమస్యలు మేనిఫెస్టోలో చేర్చుతాం

- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క
- పదోరోజుకు చేరిన పాదయాత్ర

ఆసిఫాబాద్: పాదయాత్ర ద్వారా తమ దృష్టికి వచ్చిన సమస్యలు ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చుతామని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పేర్కొన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా భట్టి పీపుల్స్ మార్చ్ పేరిట చేపట్టిన పాదయాత్ర పదోరోజుకు చేరింది. శనివారం జిల్లా కేంద్రంలోని ఆదిలాబాద్ ఎక్స్‌రోడ్డు సమీపంలోని క్యాంపులో మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ సభ్యుడు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేశ్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాదరావు, పీసీసీ సభ్యుడు డాక్టర్ గణేశ్‌రాథోడ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. తమ ప్రభుత్వ హయాంలో పోడు భూములకు పట్టాలివ్వగా, వాటిని ధరణి పేరుతో తొలగించారని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని విమర్శించారు. ఆదివాసీలకు భూమి, నీళ్లు, ఇండ్లు లేవని, అడవిలోకి పోనివ్వడం లేదని, తామెలా బతికేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చాక ధరణిలోని లోపాలు సరిచేస్తామని చెప్పారు. పట్టాపాస్‌బుక్‌లో కాస్తు కాలం తొలగించడంతో కౌలు రైతులకు అన్యాయం జరుగుతోందన్నారు. టీఎస్‌పీఎస్సీ పరీక్ష పేపర్ లీకేజీతో నిరుద్యోగుల ఆశలు ఆవిరి చేశారని పేర్కొన్నారు. టీఎస్‌పీఎస్సీ పరీక్షలు తిరిగి నిర్వహించేలా పోరాటం చేస్తామని భరోసా కల్పించారు. పేపర్ లీకేజీకి పాల్పడ్డవారిని శిక్షించాల్సిన తెలంగాణ ప్రభుత్వం ప్రశ్నించిన నాయకులకు నోటీసులు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం రైతులకు వరికి ఎకరాకు అదనంగా రూ.9వేలు చెల్లిస్తోందని తెలిపారు. దీనిపై అధిష్టానానికి సిఫార్సు చేస్తానని చెప్పారు. కాంగ్రెస్ హయాంలో జిల్లాలో 64 చెరువులు, ఎనిమిది మధ్య తరగతి ప్రాజెక్టులు నిర్మించామని, తొమ్మిదేళ్లుగా సాగునీరందించేందుకు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని ఆరోపించారు.

రాహుల్‌పై అనర్హత వేటు రాజ్యాంగ విరుద్ధం

రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వంపై అనర్హత వేటు వేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. స్పీకర్ తీసుకున్న నిర్ణయంలో రాజ్యాంగ స్ఫూర్తి కనిపించడం లేదన్నారు. ప్రజాస్వామ్యాన్ని కూల్చేలా ప్రధాని మోదీ, అమిత్‌షా నియంతృత్వ పోకడలున్నాయని పేర్కొన్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు రాహుల్ పాదయాత్రకు భయపడి తప్పుడు కేసు పెట్టారని ఆరోపించారు. హైకోర్టు తీర్పునకు 30 రోజులు గడువున్నా మోదీ, అమిత్‌షా కుట్ర పూరితంగా వ్యవహరించారని విమర్శించారు. గతంలో ఇందిరాగాంధీ హయాంలో ఇలాగే వ్యవహరిస్తే ఎన్నికల్లో ప్రజలు బ్రహ్మరథం పట్టారని గుర్తు చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, దేశ సంపద ప్రజలకు చెందాలని రాహుల్ గాంధీ మాట్లాడితే, అదానీ లాంటి వాళ్ల కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. దేశంలో ఎయిర్‌పోర్టులు, సీ పోర్టులు, బొగ్గు గనులు, పవర్ సెక్టార్, ప్రభుత్వ రంగ సంస్థలు అన్నీ ప్రజలకే చెందాలని.. క్రోని క్యాపిటలిస్టులైన అదానీకి దోచి పెట్టడం సరికాదన్నందుకే రాహుల్‌పై ప్రధాని మోదీ కక్ష కట్టారని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం ప్రజలందరి బాధ్యత అని చెప్పారు. ఇందుకు ప్రజాస్వామ్యవాదులు, ప్రగతిశీల వాదులు, లౌకిక వాదులు, రాజ్యాంగ ప్రేమికులు ప్రజాస్వామ్యం, దేశ సంపదను కాపాడుకోవాలని సూచించారు. బీజేపీ అకృత్యాలను ముక్తకంఠంతో ఖండించాలన్నారు. రాహుల్‌గాంధీకి దేశంలోని అన్ని పార్టీలు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నాయని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడమంటే రాహుల్‌గాంధీని కాపాడుకోవడమేనని స్పష్టం చేశారు. లోకసభ స్పీకర్‌కు ఒక సభ్యుడిని చట్టసభల నుంచి బహిష్కరించడం, సస్పెండ్ చేయడం విచక్షణ అధికారమైనప్పటికీ, ఆ విచక్షణ అధికారం భారత రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ఉండాలని, ఇది కక్ష సాధింపు చర్యగా ఉందని పేర్కొన్నారు. 1975లో మాజీ ప్రధాని, స్వర్గీయ ఇందిరాగాంధీని అలహాబాద్ కోర్టు ఆరేళ్లు బహిష్కరిస్తే తన పదవికి రాజీనామా చేసి, తిరిగి పోటీ చేయగా ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించారని గుర్తు చేశారు. ప్రజాస్వామిక వాదులను అణగదొక్కడం కోసం నియంతృత్వ పోకడలు అవలంబించే ప్రభుత్వాలకు ప్రజలు బుద్ధి చెప్పిన చరిత్ర ఈ దేశానికి ఉందని పేర్కొన్నారు. సమావేశంలో మంచిర్యాల డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, పీసీసీ కార్యదర్శి మర్సుకోల సరస్వతి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో సీపీఆర్‌పై శిక్షణ



సీపీఆర్ శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఆసిఫాబాద్‌అర్బన్: కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో శనివారం సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమానికి కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవ్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సీపీఆర్ చేయడం ద్వారా గుండెపోటుకు గురైన వ్యక్తిని ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడవచ్చని సూచించారు. కోవిడ్ అనంతరం చాలామంది గుండె నొప్పి కారణంగా మృత్యువాత పడుతున్న నేపథ్యంలో ప్రజా సంక్షేమానికి ప్రతి ఒక్కరికీ సీపీఆర్‌పై అవగాహన కల్పించే ప్రయత్నంలో భాగంగా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. గుండెపోటు కారణంగా అకస్మాత్తుగా కింద పడిపోయిన వ్యక్తి ఛాతి మధ్యలో చేతులతో ఒత్తుతూ సీపీఆర్ చేస్తే తిరిగి అతడు స్పృహలోకి వస్తాడని, ఆ తర్వాత చికిత్స అందించవచ్చని తెలిపారు. సీపీఆర్ చేయడం ప్రతి ఒక్కరూ నేర్చుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీడీవోలు, మండల పంచాయతీ అధికారులు, సర్పంచులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేసవిలో అప్రమత్తంగా ఉండాలి

ఆసిఫాబాద్‌అర్బన్: వేసవి సమీపిస్తున్నందున అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవ్‌రావ్ ఆదేశించారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జనసంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, అంబలి పంపిణీ చేయాలని, నీటి ఎద్దడి లేకుండా చూడాలని సూచించారు. పీహెచ్‌సీల్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని వివరించారు. మన ఊరు–మన బడి కింద ఎంపికైన పాఠశాలల్లో అభివృద్ధి పనులు, అంతర్గత రహదారులు, సోషల్ ఆడిట్ పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

‘సామాజిక న్యాయం కోసమే జన చైతన్యయాత్ర’



జన చైతన్యయాత్రలో రాజన్న, నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా సామాజిక న్యాయం కోసం సీపీఎం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జన చైతన్యయాత్ర చేపట్టినట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి కూశన రాజన్న పేర్కొన్నారు. జన చైతన్యయాత్ర రెండురోజుల క్రితం జిల్లాలోకి ప్రవేశించగా శనివారం మండలంలోని కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వద్ద స్థానిక సీపీఎం నాయకులు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా రాజన్న మాట్లాడుతూ.. మోదీ, అమిత్ షా నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు రూ.లక్షల కోట్లు కట్టబెడుతూ ప్రజలపై తీవ్ర ఆర్థికభారాన్ని మోపుతోందని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం దేశంలో 23కోట్ల మందిని పేదలుగా మార్చిందని విమర్శించారు. 2014లో రూ.410 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర నేడు రూ.1,105కు పెంచిందన్నారు. జన చైతన్యయాత్ర ద్వారా ప్రజలను ఐక్యం చేసేందుకు సీపీఎం కృషి చేస్తోందని చెప్పారు. ఈనెల 29న యాత్ర ముగింపు సందర్భంగా ఇందిరాపార్క్ వద్ద బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట శ్రీనివాస్, దుర్గం దినకర్, జిల్లా కమిటీ సభ్యులు అల్లూరి లోకేశ్, గొడిసెల కార్తీక్, శ్రీనివాస్, రాజేందర్, ఆనంద్‌కుమార్, నాయకులు అశోక్, పురుషోత్తం, భీమేశ్, ఓదెలు పాల్గొన్నారు.

అవార్డులు రావడం అభినందనీయం

- కలెక్టర్ హేమంత్ బొర్కడే సహదేవ్‌రావు
- సర్పంచులకు అవార్డుల ప్రదానం



నంబాల సర్పంచ్‌కు పురస్కారం అందజేస్తున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు

ఆసిఫాబాద్: జిల్లాలోని గ్రామపంచాయతీలకు దీనదయాళ్ ఉపాధ్యాయ పంచాయతీ పురస్కార్–2023 అవార్డులు రావడం అభినందనీయమని కలెక్టర్ హేమంత్ బొర్కడే సహదేవ్‌రావు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో శనివారం అదనపు కలెక్టర్ రాజేశం, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావుతో కలిసి జిల్లా స్థాయి ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 73వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రభుత్వాలు పంచాయతీలకు ఎన్నో అధికారాలు కల్పించినట్లు చెప్పారు. తొమ్మిది విభాగాల్లో జిల్లాలోని ప్రతీ గ్రామపంచాయతీ అభివృద్ధి చెందేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేసి గ్రామాలాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. జిల్లాలో తొమ్మిది మండలాల్లోని 13 గ్రామపంచాయతీలకు 27 అవార్డులు దక్కినట్లు పేర్కొన్నారు. జైనూర్ మండలం మార్లవాయి గ్రామపంచాయతీకి ఐదు విభాగాల్లో, జంగాం గ్రామపంచాయతీకి రెండు విభాగాల్లో, దాబా గ్రామపంచాయతీకి మూడు విభాగాల్లో, సిర్పూర్ (టీ) మండలం వేంపెల్లి గ్రామపంచాయతీకి ఏడు విభాగాల్లో, కౌటాల గ్రామపంచాయతీకి రెండు విభాగాల్లో, ఆసిఫాబాద్ మండలం అగ, సిర్పూర్ (యు) మండలం మహాగాం, పాములవాడ గ్రామపంచాయతీలకు ఒక్కో విభాగంలో, వాంకిడి మండలం బంబార, కెరమెరి మండలం సావర్‌ఖేడ్, లింగాపూర్ మండలం కొత్తపెల్లి, రెబ్బెన మండలం నంబాల గ్రామపంచాయతీలకు జిల్లా స్థాయి అవార్డులు అందించినట్లు తెలిపారు. అనంతరం ఆయా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యాన్ని సాధించేందుకు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే ఆత్రం సక్కు మాట్లాడుతూ.. గ్రామాల్లో అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పనలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోల కృషి అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీపీవో రమేశ్, ఎంపీపీలు విమలాబాయి, విశ్వనాథ్, నానయ్య, జెడ్పీటీసీలు అరిగెల నాగేశ్వర్‌రావు, కోవ అరుణ, సంతోష్, ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల బలోపేతానికి చర్యలు



అవార్డులు ఇస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఆసిఫాబాద్‌అర్బన్: మహిళా సంఘాల బలోపేతానికి పూర్తిస్థాయి చర్యలు తీసుకోనున్నట్లు కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవ్‌రావ్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, జిల్లా సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో రూ.25 లక్షలతో ఏర్పాటు చేసిన నాన్ ఓవెన్ బ్యాగుల తయారీ యంత్రం, రూ.2లక్షలతో ఏర్పాటు చేసిన చిరుధాన్యాల పిండి గిర్ని యంత్రాలను జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాను అన్ని రంగాల్లో ముందు వరుసలో ఉంచడంలో భాగంగా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సినిమా థియేటర్ విజయవంతంగా నడుస్తోందని చెప్పారు. దీనిలో మహిళా సంఘాల కృషి ఎంతగానో ఉందని కొనియాడారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు ప్రోత్సహించనున్నట్లు పేర్కొన్నారు. మహిళలు తమ సంఘాల ఆధ్వర్యంలో ఉత్పత్తి అవుతున్న బ్యాగులు మార్కెటింగ్ చేయడం ద్వారా అభివృద్ధి చెందాలని సూచించారు. మహిళా సంఘాలు ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా ముందుకు సాగాలని, ఉత్పత్తి అయిన బ్యాగులు ప్రతీ షాపునకు అందించి మార్కెటింగ్ చేయాలని చెప్పారు. జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి మాట్లాడుతూ.. జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సినిమా హాల్, షాపులు, బ్యాగులు తయారు చేసే యంత్రం ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని సూచించారు. ఎమ్మెల్యే ఆత్రం సక్కు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన వడ్డీ లేని రుణాల చెక్కులు పంపిణీ చేయడం సంతోషంగా ఉందని, ప్రతీ మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, మహిళా సంఘాల సభ్యులు తీసుకొన్న రుణాలు తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం శ్రీనిధి అవార్డులు అందజేశారు. అధికారులు సురేందర్, శ్రీనివాస్‌రెడ్డి, హనుమంత్‌రావ్, ఏపీఎంలు, సీసీలు, మహిళా సమాఖ్య సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రమాదవశాత్తు బీరువా దగ్ధం


కాలిపోయిన బీరువా

దహెగాం(సిర్పూర్): మండలంలోని కోత్మీర్ గ్రామానికి చెందిన దేవసూరి తిరుపతి ఇంట్లో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగడంతో ఇంట్లోని బీరువా దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో లోపలినుంచి పొగలు రావడంతో గమనించిన స్థానికులు మంటలు ఆర్పివేశారు. అప్పటికే బీరువా పూర్తిగా కాలిపోవడంతో అందులో ఉన్న రూ.20 వేల నగదు, ఆభరణాలు కాలిపోయాయని బాధితుడు పేర్కొన్నాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ ప్రహ్లాద్ ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించారు. ప్రభుత్వం తరపున సహాయం అందేలా చూస్తామని మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ సంతోష్‌గౌడ్, బీబ్రా సర్పంచు బండ క్రిష్ణమూర్తి పేర్కొన్నారు.

గోదావరిలో పడి వృద్ధుడు మృతి


సత్తన్న (ఫైల్)

జన్నారం: ప్రమాదవశాత్తు గోదావరిలోపడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలోని చింతగూడలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సిలివేరి సత్తన్న (55) శుక్రవారం సాయంత్రం ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోట వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం గోదావరిలో మృతదేహం తేలి ఉండడాన్ని గమనించిన గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గోదావరి రేవు ధర్మపురి మండల పరిధిలోకి రావడంతో ధర్మపురి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

అడవిపంది దాడిలో ఒకరికి గాయాలు


చికిత్స పొందుతున్న భీమయ్య

దహెగాం: మండలంలోని కోత్మీర్ గ్రామానికి చెందిన భామిని భీమయ్యపై అడవిపంది దాడి చేయడంతో గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం పత్తి చేనుకు వెళ్లిన భీమయ్య పత్తి కట్టె తొలగిస్తుండగా ఒక్కసారిగా అడవిపంది దాడి చేసింది. తీవ్రగాయాలు కావడంతో కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

మద్యం మత్తులో యువకుడు ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: మద్యం మత్తులో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై తాసినొద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం ఇస్లామ్‌పూరకు చెందిన ఎండీ హైమద్–షాలిన్ దంపతుల కుమారుడు ఎండీ గౌస్ (25) పెద్దపల్లి జిల్లా కేంద్రంలో లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవలే ఇంటికి వచ్చిన గౌస్ శుక్రవారం రాత్రి మద్యం మత్తులో రైల్వేస్టేషన్ సమీపంలో భిక్షాటన చేసుకునే వారితో గొడవపడ్డాడు. తలకు స్వల్ప గాయం కావడంతో ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నాడు. అనంతరం బయటకు వచ్చి బెల్లంపెల్లి చౌరస్తాలో నిర్మాణంలో ఉన్న బిల్డింగ్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

చౌక యాత్ర

సండే స్పెషల్

- తక్కువ బడ్జెట్‌లోనే పర్యాటకం
- కలిసి వస్తున్న కొత్త సహ యాత్రికులు
- ఔత్సాహికుల కోసం వెబ్‌సైట్

స్నేహితులతో కలిసి ట్రెక్కింగ్ చేయాలని.. విభిన్న ప్రదేశాలను సందర్శించాలని.. పర్యాటక ప్రాంతాలకు వెళ్లాలని అందరికీ ఉంటుంది. కానీ కొందరి అడుగే ముందుకు పడుతుంది. ఆర్థికంగా భారమని భావించడం.. కలిసి రావడానికి స్నేహితులకు సమయం కుదరకపోవడం వల్ల మరికొందరి పర్యటన వాయిదా పడుతూనే ఉంటుంది. అతి తక్కువ బడ్జెట్‌లోనే.. మనకు వీలైన సమయానికి కొత్త సహ పర్యాటకులతో పర్యటన పూర్తయితే ఆ ఆనందమే వేరు. అలాంటి ఔత్సాహికుల కోసం వైహెచ్ఏఐ (యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) తోడ్పాటు అందిస్తోంది.

– సాక్షి, మంచిర్యాలడెస్క్

ఇదీ వెబ్‌సైట్:
https:// www. yhaindia. org


గోవాలో ట్రెక్కింగ్‌కు హాజరైన వివిధ రాష్ట్రాల పర్యాటకులు

వైహెచ్ఏఐ లక్ష్యం..

ప్రయాణం, పర్యాటకం, సాహస యాత్రలకు తక్కువ ధరలో తోడ్పాటు అందించడం, సామాజిక, అభివృద్ధి, సమస్యలపై యువతలో అవగాహన పెంపొందించడం వైహెచ్ఏఐ లక్ష్యం. ఇంగ్లాండ్‌లోని హాస్టలింగ్ ఇంటర్నేషనల్‌లో వైహెచ్ఏఐ సభ్యత్వం కలిగి ఉంది. దేశవ్యాప్తంగా 95 యూత్ హాస్టళ్లు కలిగి ఉంది. ఈ హాస్టళ్లలో వైహెచ్ఏఐ సభ్యులకు తక్కువ ధరలో వసతి, శాకాహార భోజన సౌకర్యాలు కల్పిస్తారు. వైహెచ్ఏఐ జాతీయ చైర్మన్ వెంకటనారాయణ్ ఆధ్వర్యంలో అన్ని చోట్ల కార్యకలాపాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. దేశంలో ఇప్పటికే సొంతంగా ఎనిమిది హాస్టళ్లు ఉన్నాయి. కొత్తవి కూడా నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగా దాతల సహకారంతో హిమాచల్‌ప్రదేశ్‌లోని కసోల్‌లో కూడా హాస్టల్ నిర్మాణం చేపట్టారు. హిమాచల్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఆహారానికి ఇబ్బందులు పడకుండా ఇటీవల దక్షిణ భారతదేశ యాత్రికుల కోసం ఇడ్లి, పొంగల్, కిచిడీ, వెజిటేబుల్ ఫ్రైడ్ రైస్ ఏర్పాటు చేస్తున్నారు.

సభ్యత్వం

వైహెచ్ఏఐ ఐదు రకాల సభ్యత్వాన్ని అందిస్తోంది. జీవితకాల సభ్యత్వం, సీనియర్(ఏడాది, రెండేళ్లు), జూనియర్(ఏడాది), వైహెచ్ఏఐ, ఐవైటీసీకో బ్రాండెడ్, ఇన్‌స్టిట్యూషనల్ సభ్యత్వం ఇస్తుంది. దేశవ్యాప్తంగా రెండు లక్షల మంది సభ్యులు ఉండగా.. ఇందులో లక్ష మంది జీవితకాల సభ్యత్వం కలిగి ఉన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ, రాష్ట్ర స్థాయిలో, వారాంతపు కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. సభ్యులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తారు. కార్యక్రమాల షెడ్యూల్, ప్యాకేజీ, సభ్యుల సంఖ్యను వెబ్‌సైట్‌లో ప్రకటిస్తారు. వెళ్లాలనుకునే వారు అందులో నమోదు చేసుకోవాలి. ఎంత చార్జీ, ఎన్ని రోజులు, ఏ ప్రాంతం, ఎక్కడికి రావాలి, పాటించాల్సిన నిబంధనలు సూచిస్తారు. సందర్శించే ప్రాంతాన్ని బట్టి ఎన్ని రోజులు అనేది నిర్ణయిస్తారు. అక్కడికి చేరుకున్న పర్యాటకులకు ముందుగానే శిక్షణ ఇచ్చి స్థానిక వాతావరణానికి అలవాటు పడేలా సూచనలు చేస్తారు.

తొమ్మిది యూనిట్లు

రాష్ట్రంలో తొమ్మిది యూనిట్లు ఉన్నాయి. మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి యూనిట్‌తోపాటు సైబరాబాద్, గ్రేటర్ హైదరాబాద్ అడహక్, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, మియాపూర్, సికింద్రాబాద్, తెలంగాణ బీటీ ఎస్ఆర్, విహంగ మహిళా అడహక్ యూనిట్ ఉన్నాయి. ఆసక్తి గల వారు ఆయా యూనిట్లలో సభ్యత్వం తీసుకుని విహార యాత్ర కార్యక్రమాల్లో పాల్గొనవచ్చు. ఆన్‌లైన్, యూనిట్ ద్వారా బుక్ చేసుకోవాలి. యూనిట్లు నిర్ణయించిన తేదీల్లో పర్యటనకు సూచించిన స్థలానికి మన చార్జీలతో చేరుకోవాల్సి ఉంటుంది. అక్కడి నుంచి పర్యటన పూర్తయ్యే వరకు వసతి సౌకర్యం, ఆహారం నిర్ణయించిన ప్యాకేజీ రుసుంలోనే కల్పిస్తారు.


గోవాలోని జలపాతం

బెల్లంపల్లిలోనూ యూత్ హాస్టల్

బెల్లంపల్లిలోనూ యూత్ హాస్టల్‌ను ఏర్పాటు చేశారు. వైహెచ్ఏఐ విజ్ఞప్తి మేరకు సింగరేణి సంస్థ బెల్లంపల్లిలో ఓ భవనాన్ని యూత్ హాస్టల్ కోసం అద్దెకు కేటాయించింది. ట్రెక్కింగ్‌కు వెళ్లడానికి వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ బస చేస్తారు. గాంధారిఖిల్లా, కుమురంభీం జిల్లా తిర్యాణి జలపాతాలు, జోడేఘాట్, ఆదిలాబాద్ అటవీ ప్రాంతం ట్రెక్కింగ్ కోసం వెళ్తారు.

ఆదిలాబాద్‌లో నిర్వహణకు సన్నాహాలు



బెల్లంపల్లి యూనిట్‌లో 170మంది సభ్యులు ఉన్నారు. జాతీయస్థాయిలో కొన్ని కార్యక్రమాలు ఉంటాయి. ట్రెక్కింగ్, బైకింగ్, సైక్లింగ్, బోటింగ్, ఫ్యామిలీ, చిల్డ్రన్స్ క్యాంప్ రకరకాలు ఉంటాయి. గోవాలో మాన్‌సూన్ ట్రెక్కింగ్, ఉత్తరాఖండ్‌లోని వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్‌కు వెళ్లొచ్చాం. జైసల్మేర్‌లో ఫ్యామిలీ క్యాంప్‌నకు వెళ్లాం. భార్యాభర్తలు, 12ఏళ్లలో పిల్లలకు కలిపి ఒక టెంటు ఇస్తారు. నాలుగు రాత్రులు, ఐదు పగళ్లు ఉండడానికి వసతి సౌకర్యం, ఆహారానికి అంతా కలిపి రూ.7వేల నుంచి రూ.8వేలు చార్జీ చేస్తారు. ఈ క్యాంప్‌లు ఊటి, కులూ, మున్నార్‌లో కూడా ఉంటాయి. గత వేసవిలో హిమాచల్‌ప్రదేశ్‌లోని డోలారిపాస్, లడక్‌లో మోటార్‌సైక్లింగ్‌కు వెళ్లాం. హిమాచల్‌ప్రదేశ్‌లో డల్‌హౌసి ట్రెక్కింగ్‌కు వెళ్లాం. సైక్లింగ్‌కు వెళ్లినప్పుడు సైకిల్ సౌకర్యం కూడా కల్పిస్తారు. ఉత్తరాఖండ్ వంటి ప్రాంతానికి వెళ్లినప్పుడు స్థానిక వాతావరణానికి అలవాటు పడడానికి చిన్న చిన్న ప్రదేశాలకు తీసుకెళ్తారు. తిరుమల తిరుపతి అడవుల్లో కూడా ఒక ట్రెక్కింగ్ నిర్వహిస్తారు. కపిలతీర్థం, రామకృష్ణ తీర్థం కూడా చూడవచ్చు. జాతీయ స్థాయిలో వెళ్లిన ట్రెక్కింగ్‌లకు రాజస్తాన్, గుజరాత్, గోవా, కేరళ తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన వారు స్నేహితులయ్యారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 50కిలోమీటర్ల పరిధిలో పది నుంచి 12 జలపాతాలు ఉన్నాయి. అటవీశాఖ అధికారుల సహకారంతో నాలుగు రోజుల కార్యక్రమం ఆగస్టు తర్వాత నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నాం.

–శ్యాంసుందర్‌రెడ్డి, వైహెచ్ఏఐ తెలంగాణ వైస్‌ప్రెసిడెంట్, మంచిర్యాల

జీవితంలో మార్పునకు దోహదం



కొత్త కొత్త ప్రాంతాల్లో ట్రెక్కింగ్, సైక్లింగ్ అనేది జీవితంలో మార్పునకు దోహదపడుతుంది. గోవా, హిమాచల్‌ప్రదేశ్‌లోని డల్హౌసి, ఛత్తీస్‌గఢ్‌లోని జగ్దల్‌పూర్, మహారాష్ట్రలోని మహాబలేశ్వర్‌లో ట్రెక్కింగ్‌కు వెళ్లొచ్చాను. యూత్ హాస్టల్‌లో సభ్యులుగా ఉండడం వల్ల చాలా తక్కువ మొత్తంలోనే వివిధ ప్రాంతాలు సందర్శించి రావచ్చు. 2018లో మొదటిసారి హిమాచల్‌ప్రదేశ్‌లో ట్రెక్కింగ్‌కు వెళ్లొచ్చాను. మానసిక ఒత్తిడి నుంచి చాలా ప్రశాంతత పొందాను. బెంగళూర్, మహారాష్ట్ర, హిమాచల్‌ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, కేరళ, ఢిల్లీ తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన కొందరు స్నేహితులు అయ్యారు. విద్యావంతులు, వ్యాపారవేత్తలు వస్తుంటారు. ఒకరి ఆలోచనలు మరొకరు పంచుకోవడం వల్ల వ్యక్తిగతంగా, వ్యాపారపరంగా ఎంతో ప్రయోజనం కలుగుతుంది. గోవా అంటే మద్యం, పబ్బులు అనుకుంటారు కానీ పది జలపాతాలు ఉన్నాయి. 12వేల అడుగుల పైకి ట్రెక్కింగ్ చేస్తూ వెళ్లి జలపాతాలు చూడొచ్చు. నేను ఇప్పటివరకు వెళ్లొచ్చిన ట్రెక్కింగ్‌లకు ఒక్కోదానికి రూ.6వేల నుంచి రూ.7వేల వరకు ఖర్చయింది. ఐదు రోజులు ఆహారం, స్థానికంగా రవాణా, బస సౌకర్యం కల్పిస్తారు. ప్రతీ సంవత్సరం వెళ్లొస్తుంటాను. జీవితంలో మార్పు కోరుకునే యువత ట్రెక్కింగ్‌లకు వెళ్లాలి. వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతాయి.

– కొండగొర్ల చంద్రశేఖర్, బెల్లంపల్లి

బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక


సురేందర్, లక్సెట్టిపేట


మల్లేశంగౌడ్, చెన్నూర్

లక్సెట్టిపేట(మంచిర్యాల): మండల కేంద్రంలోని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి గోవిందరావు తెలిపారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా కారుకూరి సురేందర్, ప్రధాన కార్యదర్శిగా నేరెళ్ల రాజేశ్వర్ ఎన్నికయ్యారు.

చెన్నూర్: చెన్నూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పొన్నం మల్లేశంగౌడ్, వైస్ ప్రెసిడెంట్‌గా రమేశ్‌చందర్ గిల్డా, సెక్రటరీగా ఎస్.నిరంజన్, కోశాధికారిగా జె.పున్నంనాగు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సీపీఆర్ఎంఎస్ దరఖాస్తు గడువు 31

శ్రీరాంపూర్: ఉద్యోగ విరమణ కార్మికులు మెడికల్ కార్డు ద్వారా ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్సలు పొందే సీపీఆర్ఎంఎస్ స్కీంకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 31 వరకు గడువు ఉందని డీజీఎం(పర్సనల్) అరవిందరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూలై 1, 2016 నుంచి పదో వేజ్ బోర్డు అమలైన తర్వాత రిటైరైన, మరణించిన, మెడికల్ అన్‌ఫిట్ అయిన కార్మికులు సీపీఆర్ఎంఎస్ స్కీం కింద కార్డులు పొందడానికి దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

కొనసాగుతున్న ఆర్థికసాయం

నెన్నెల(బెల్లంపల్లి): 'అమ్మా నాన్నలను ఆదుకోండి' అనే శీర్షికన ఈ నెల 20న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి దాతలు స్పందిస్తున్నారు. శనివారం మంచిర్యాలకు చెందిన నేత్ర వైద్య నిపుణులు సుఖబోగి వెంకటేశ్వర్లు ఫోన్ పే ద్వారా రూ.5 వేలు అందజేశారు. డయాసిస్ ఆఫ్ ఆదిలాబాద్ హ్యూమన్ ప్రమోషన్ సొసైటీ సభ్యులు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, మందులు పంపిణీ చేశారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా పిల్లలకు స్కాలర్‌షిప్ అందేలా చూస్తామని చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ సత్యనారాయణ అన్నారు. ఆర్థికసాయం అందించాల్సిన వారు 9573570508 నంబర్‌కు ఫోన్‌పే చేసి ఆదుకోవాలని చిన్నారులు వేడుకుంటున్నారు.

సంఘ విద్రోహశక్తులకు దూరంగా ఉండాలి

భీమారం(చెన్నూర్): యువత సంఘ విద్రోహ శక్తులకు దూరంగా ఉండాలని ఏసీపీ నరేందర్ పిలుపునిచ్చారు. శనివారం బూర్గుపల్లిలో కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ మాట్లాడుతూ సమాజాన్ని పక్కదారిపట్టించే వారిని దూరంగా ఉంచాలని యువతకు సూచించారు. ప్రజలకు భద్రతతో పాటు రక్షణ కల్పించడమే పోలీస్‌శాఖ ధ్యేయమన్నారు. సైబర్ నేరస్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ సీఐ రాజు, భీమారం, జైపూర్ ఎస్సైలు గట్ల సుధాకర్, రామకృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆ రెండు సంఘాలకు బుద్ధిచెప్పాలి

- హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్


మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

శ్రీరాంపూర్(మంచిర్యాల): కార్మికులకు ద్రోహం చేస్తున్న టీబీజీకేఎస్, ఏఐటీయూసీ సంఘాలకు కార్మికులు బుద్ధి చెప్పాలని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ పిలుపునిచ్చారు. శనివారం ఆర్కే 5 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. ఇప్పటి వరకు రెండుసార్లు ఏఐటీయూసీ, టీబీజీకేఎస్ గుర్తింపు సంఘంగా గెలిచి కార్మికులకు ఏమాత్రం న్యాయం చేయలేదన్నారు. సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలు పునరుద్ధరిస్తామని చెప్పి మోసం చేశారన్నారు. మెడికల్ ఫిట్ కోసం కార్మికుల వద్ద నుంచి పెద్ద ఎత్తున డబ్బులు దండుకున్నారన్నారు. సింగరేణిలో అవినీతి, కుంభకోణాలు జరుగుతున్నా ఏనాడూ స్పందించలేదన్నారు. ఈ సంఘాలకు వచ్చే గుర్తింపు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయూనియన్ బ్రాంచి ఉపాధ్యక్షుడు జీవన్‌జోయల్, కార్యదర్శి తిప్పారపు సారయ్య, పిట్ సెక్రటరీ బానోత్ శ్రీనివాస్, నాయకులు దుర్గం లక్ష్మణ్, సాయి, నామాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎత్తు వేస్తే ప్రత్యర్థి చిత్తే!

- చెస్‌లో సత్తా చాటుతున్న కాసిపేట గురుకుల విద్యార్థి
- వరల్డ్ స్కూల్ చెస్ పోటీలకు ఎంపికైన ఆకాశ్‌కుమార్


ఆకాశ్‌కుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్(ఫైల్)

బెల్లంపల్లి: పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థి ఐరోండ్ల ఆకాష్‌కుమార్ వరల్డ్ స్కూల్ చెస్ పోటీలకు ఎంపికయ్యాడు. తాండూర్ మండలంలోని రేపల్లేవాడకు చెందిన ఐరోండ్ల లక్ష్మి, సమ్మయ్య దంపతుల కుమారుడు ఆకాష్‌కుమార్ ప్రస్తుతం పదోతరగతి చదువుతున్నాడు. ఏప్రిల్ 13 నుంచి 23 వరకు గ్రీస్ దేశంలో నిర్వహించనున్న వరల్డ్ స్కూల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో అండర్–17 విభాగంలో భారతదేశం తరపున పాల్గొననున్నాడు.

స్పోర్ట్స్ అకాడమీలో ప్రత్యేక శిక్షణ..

చిన్నతనం నుంచే సదరు విద్యార్థికి చెస్‌పై ఉన్న ఆసక్తిని గమనించిన గురుకుల విద్యాలయ సంస్థ ప్రోత్సాహంతో హైదరాబాద్ కేంద్రంగా నిర్వహిస్తున్న సంక్షేమ గురుకుల స్పోర్ట్స్ అకాడమీలో ప్రత్యేక శిక్షణకు ఎంపికయ్యాడు. ఎనిమిదో తరగతిలోనే స్పోర్ట్స్ అకాడమీ శిక్షణకు ఎంపికై జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటాడు.

ఏషియన్ చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో..

2022 డిసెంబర్‌లో శ్రీలంకలో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్న విద్యార్థి అత్యంత ప్రతిభ కనబర్చి సిల్వర్ మెడల్ సాధించాడు. శ్రీలంక ప్రధాన మంత్రి దినేష్ గుణవర్ధనే చేతుల మీదుగా వెండిపతకం అందుకున్నాడు.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో..

ఆకాష్‌కుమార్ తల్లి గృహిణి కాగా తండ్రి సమ్మయ్య ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. సమ్మయ్యకు చెస్ అంటే ఎంతో ఇష్టం. తన ఇష్టాన్ని కుమారుడిపై మళ్లించాడు. చిన్నతనం నుండే చెస్‌క్రీడపై మక్కువ పెంచుకునేలా చేశాడు. కాసిపేట గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశం పొందిన తర్వాత మరింత ప్రోత్సాహం లభించింది.

వరల్డ్ చెస్ పోటీల్లో రాణిస్తా



చిన్ననాటి నుంచే చెస్ అంటే ఎంతో ఇష్టం. అమ్మానాన్నలు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ ప్రోత్సాహంతో మూడేళ్లుగా సంస్థ స్పోర్ట్స్ అకాడమీలో శిక్షణ తీసుకుంటున్నా. గ్రీస్ దేశంలో జరుగనున్న వరల్డ్ స్కూల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ కనబర్చి దేశానికి, గురుకుల సొసైటీకి మంచి పేరు తీసుకువస్తా.

– ఆకాశ్‌కుమార్, కాసిపేట గురుకుల పాఠశాల

కార్మికుల సంక్షేమానికి పెద్దపీట


ప్రారంభిస్తున్న జీఎం శ్రీనివాస్

రామకృష్ణాపూర్(చెన్నూర్): సింగరేణి యాజమాన్యం కేవలం బొగ్గు ఉత్పత్తికే పరిమితం కాకుండా కార్మికులు, ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ అన్నారు. మందమర్రి ఏరియాలోని రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన అధునాతన డిజిటల్ ఎక్స్‌రే కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో రూ.16 లక్షల వ్యయంతో ప్రారంభించిన యంత్రం ద్వారా ఎముకలు, ఊపిరితిత్తులు, అవయవాల సమస్యలు కూడా నిర్ధారించే అవకాశం ఉంటుందన్నారు. ఏరియా పరిధిలోని సింగరేణి కార్మికులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం ఓదెలు, పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్, డీవైసీఎంఓ ఉషారాణి, యూనియన్ నాయకులు అక్బర్ అలీ, శంకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

'నేలతల్లి గొంతుక' ఆవిష్కరణ

మంచిర్యాలఅర్బన్: పట్టణంలోని ట్రినిటి హైస్కూల్‌లో శనివారం కవి, రచయిత పెద్ది భరత్ రచించిన నేలతల్లి గొంతుక పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దేశభక్తుడిగా, తెలుగుతల్లి బిడ్డగా కవిగా తాను దర్శించిన ప్రకృతిని, జీవిత పాఠాలను వివిధ సందర్భాల్లో ఎదుర్కొన్న సంఘటనలను తనదైన శైలిలో ఎంతో అద్భుతంగా 40 వచనా కవితలతో తొలి సంపుటిని వెలవరించారని కొనియాడారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది నారుమంచి అనంత వెంకటకృష్ణతో పాటు కవులు, రచయితలు మలయశ్రీ, శ్రీలక్ష్మి, రాజిరెడ్డి, వామన్‌రావు, శ్రీనివాస్, సుబ్బాయమ్మ, యోగేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.


పుస్తకం ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

సీహెచ్‌పీ కార్మికులకు జీఎం అభినందన


అభినందిస్తున్న జీఎం శ్రీనివాస్

రామకృష్ణాపూర్(చెన్నూర్): బొగ్గు రవాణాలో నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేసిన రామకృష్ణాపూర్ సీహెచ్‌పీ కార్మికులను మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ శనివారం సీహెచ్‌పీ ఆవరణలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరానికి 33 లక్షల 2 వేల టన్నుల బొగ్గు రవాణా లక్ష్యం కాగా వారం రోజుల ముందుగానే 33 లక్షల 20 వేల టన్నుల బొగ్గును రవాణా చేయడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లోనూ ఇదే స్ఫూర్తిని కనబర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం ఓదెలు, ఏజీఎం నాగరాజు, డీజీఎం బాలాజీ భగవతి, డీవైఎస్ఈలు చంద్రమౌళి, అశోక్‌రెడ్డి, యూనియన్ నాయకులు అక్బర్ అలీ, శంకర్‌రావు, సంజీవ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాల భవనం ప్రారంభం

మంచిర్యాలటౌన్: జిల్లాకు మంజూరైన ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవనాన్ని శనివారం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ సులేమాన్ ప్రారంభించారు. ఈ ఏడాది జనవరిలోనే అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి చేసినా పక్కా భవనం లేకపోవడంతో ఆన్‌లైన్ ద్వారానే తరగతులు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఫాతిమా జూలియెట్, వైస్ ప్రిన్సిపాల్ సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులకు వైద్యపరీక్షలు

సాక్షి ఎఫెక్ట్..

కోటపల్లి(చెన్నూర్): 'జ్వరాల బారిన ఆశ్రమ విద్యార్థినులు' అనే శీర్షికన శనివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు స్పందించారు. డాక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం కోటపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో వైద్యపరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల్లో జలుబు, జ్వరలక్షణాలతో బాధపడుతున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. అనంతరం డాక్టర్ సత్యనారాయణ పాఠశాల పరిసరాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. జ్వర లక్షణాలు ఉన్న విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు.


విద్యార్థినిని పరీక్షిస్తున్న వైద్యులు